

హామీలు అమలు చేయాలి

ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



కబడ్డీలో మనమే నంబర్ 1

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. 8లో▸



మెరిసిన జిల్లా జట్టు

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. 8లో▸

న్యూస్‌రీల్

సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. చేవెళ్లలో బుధవారం డివిజన్‌లోని మండలాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దేశంలో సీపీఐ ఏర్పడినప్పుడు రాచరిక వ్యవస్థలు, బ్రిటిష్‌పాలకుల అకృత్యాలు కొనసాగుతుండేవన్నారు. అప్పుడు పార్టీ ప్రజల పక్షాన నిలబడి వాటికి వ్యతిరేకంగా పోరాడిందని గుర్తు చేశారు. ఇప్పటి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసి పాలిస్తున్నాయని మండిపడ్డారు. సీపీఐ వందేళ్ల వేడుకల సందర్భంగా అన్ని మండలకేంద్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: తెలంగాణలో పెట్టుబడులు పెట్టే అవకాశాలను వివిధ కంపెనీలు పరిశీలించాలని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు. అమెరికాలోని లాస్‌వెగాస్‌లో జరుగుతున్న ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో తెలంగాణ ప్రతినిధులుగా ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. సమ్మిట్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులను వారు కలిశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తెలంగాణ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధన, స్మార్ట్ గవర్నెన్స్ కోసం తెలంగాణ రూపొందించిన ప్రణాళికల అమలు, ఏఐ ఇన్నోవేషన్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీని మార్చాలన్న ప్రభుత్వాశయం, పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టం, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ గవర్నెన్స్ కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ లక్ష్యాలను వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

చేవెళ్ల ఎంపీ కనిపించడం లేదని ఫిర్యాదు



చేవెళ్ల ఠాణాలో సీఐ భూపాల్‌శ్రీధర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేవెళ్ల: ఎంపీగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎక్కడా కనిపించడం లేదని.. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆరోపించారు. ఈమేరకు ఎంపీ కనిపించడం లేదు.. వెతికిపెట్టండి అంటూ బుధవారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు ఈఆర్సీ ఆమోదించకుండా బీఆర్‌ఎస్ పార్టీ కృషి చేసిందని సంబరాలు నిర్వహించారు. ప్రజలపై రూ.18,500కోట్ల విద్యుత్ చార్జీల భారం పడకుండా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన కృషి ఫలించిందన్నారు. ఇది బీఆర్‌ఎస్ విజయంగా పేర్కొంటూ టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజల సమస్యలను తీరుస్తానని చెప్పి ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరువాత ప్రజా సమస్యలు పట్టించుకోవటం లేదని విమర్శించారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే చేయిస్తానని చెప్పారని.. ఈరోడ్డుపై ఎంతో మంది ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం ఈరోడ్డుపై తిరిగే ప్రజలు నరకయాతన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన తరువాత ఒక్కసారి కూడా ఈరోడ్డు గురించి కానీ, ఈప్రాంత ప్రజల సమస్యల గురించి కానీ ఎంపీ పట్టించుకోలేదని విమర్శించారు. ఫిర్యాదు చేసినవారిలో బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లయ్య, గని నర్సింలు తదితరులు ఉన్నారు.

దీపావళి శోభ

వెలుగుల వేడుకను ఘనంగా జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గురువారం పండుగ నేపథ్యంలో బుధవారం మార్కెట్లలో సందడి వాతావరణం కనిపించింది. పూలు.. పండ్లు.. ప్రమిదలు.. దొంతులు.. మిఠాయిలు.. టపాసుల కొనుగోళ్లతో కోలాహలం నెలకొంది. ఆయా దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ఇబ్రహీంపట్నం: మార్కెట్లో కొలువుదీరిన దొంతులు, బొమ్మలు



మొయినాబాద్: దొంతులు, ప్రమిదలు కొంటున్న మహిళలు



ఆమనగల్లు: ప్రమిదలు కొనుగోలు చేస్తున్న స్థానికులు



ఇబ్రహీంపట్నం: ఓ టపాసుల దుకాణంలో సందడి



ఆమనగల్లు: బాణసంచా విక్రయం

కల్తీ.. అడ్డుకట్ట ఏదీ?

మొయినాబాద్‌లోని భాస్కర మెడికల్ కాలేజీ క్యాంటిన్‌లో పురుగుపట్టిన నాసిరకం పప్పును వడ్డిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు నమూనాలు సేకరించారు. పరీక్షించగా ఆహారం అన్‌సేఫ్‌గా నిర్ధారణ అయింది. దీంతో జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు క్యాంటిన్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

తుక్కుగూడలోని ఎస్‌ఎన్‌గ్రాండ్ హోటల్ నిర్వాహకులు బిర్యానీలో సామర్థ్యానికి మించి సింథటిక్ కలర్స్ వినియోగించినట్లు ఫిర్యాదు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు, హోటల్లో తనిఖీలు నిర్వహించారు. నమూనాలు సేకరించి, పరీక్షించగా, ఈ ఆహారం తినడం ఆరోగ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని నిర్ధారణ అయింది. దీంతో సంబంధిత హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు.

కిస్మత్‌పూర్‌లోని కపానరస్టా కిచెన్ అండ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో బిర్యానీలో సామర్థ్యానికి మించి సింథటిక్ కలర్స్ కలిపినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారుల పరిశీలనలో తేలింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు నమూనాలు సేకరించి, కేసు నమోదు చేయించారు.


కనిపించని 'ఫుడ్ సేఫ్టీ'

- ఆహారపదార్థాలన్నీ నాసిరకం
- యథేచ్ఛగా మిక్సింగ్‌లు
- ప్రజారోగ్యంతో చెలగాటం
- తనిఖీలు అంతంతమాత్రం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 నమూనాలు సేకరించి పరీక్షించగా, వీటిలో 17 నమూనాలు అన్‌సేఫ్‌గా నిర్ధారణ అయినట్లు తేలింది. ఆయా హోటళ్లు, డెయిరీ ఫామ్‌లపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధిస్తున్నా కల్తీ వ్యాపారం మాత్రం ఆగడం లేదు. మోతాదుకు మించి సింథటిక్ కలర్ల వాడకం, కల్తీ ఆహార పదార్థాలతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. అనేక మంది కేన్సర్, జీర్ణకోశ వ్యాధుల బారినపడుతుండటానికి ఇదే ప్రధాన కారణమని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సర్వం కల్తీమయం

జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న హోటళ్లు, రెస్టారెంట్లు 2000 పైగా ఉన్నాయి. చిరుతిళ్లు అమ్మే తోపుడు బండ్లు, ట్రక్‌లు, పానీపూరి డబ్బాలు, నూడిల్స్ కేంద్రాలు మరో వెయ్యికిపైగా ఉన్నట్లు అంచనా. వీటితో పాటు 234 వైన్‌షాపులు, 300కుపైగా ప్రైవేటు హాస్టళ్లు, 200 ఇంటర్మీడియెట్ ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీలు, మరో ఐదు వందలకుపైగా ఐస్‌క్రీం పార్లర్లు, పాల డెయిరీలు, బేకరీలు ఉన్నాయి. పీజీ, ఇంజనీరింగ్ కాలేజీలు, ఆస్పత్రుల్లో క్యాంటిన్లు కొనసాగుతున్నాయి. ఇవి కాకుండా మసాల తయారీ, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. మెజార్టీ హోటళ్లు, ఆహార తయారీ కేంద్రాలు ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా విస్తరించిన మున్సిపాలిటీల్లోనే ఉన్నాయి. వీటిలో విధిగా తనిఖీలు నిర్వహించి, ఆహార ప్రియులకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాల్సి ఉంది. కానీ జిల్లాలో హోటళ్ల సామర్థ్యం మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు లేరు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఏర్పాటైన ఈ హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేయడం వీరికి కష్టంగా మారుతోంది. ఆహారప్రియులు ఫిర్యాదు చేసినా సకాలంలో అటెండ్ కాలేని దుస్థితి. ప్రతినెలా మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించడం, నమూనాలు సేకరించి, పరీక్షలకు పంపడం మినహా ప్రజారోగ్యాన్ని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవనే అపవాదు లేకపోలేదు. కాటేదాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న మసాల, అల్లం వెల్లుల్లి, ఐస్‌క్రీం పార్లర్లు, నెయ్యి ప్యాకింగ్ కేంద్రాల్లో తరచూ కల్తీ ఆహారం పట్టుబడుతూనే ఉంటుంది. అల్లం వెల్లుల్లి పేస్టులో ఆలు కలుపుతున్నారు. అనేక హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్న చికెన్, ఫిష్, మటన్‌కు సింథటిక్ కలర్లు అద్ది.. మసాలాలు దట్టించి, నూనెలో వేపి విక్రయిస్తున్నారు. వీటిని తిన్న ఆహారప్రియులు అనారోగ్యం బారినపడుతున్నారు.



పిల్లలు తాగే పాలు సైతం

గ్రేటర్ జిల్లాలకు నిత్యం సగటున 28 లక్షల లీటర్ల పాలు అవసరం కాగా, 22 లక్షల లీటర్లు పాల ప్యాకెట్ల రూపంలో, మరో ఆరు లక్షలు డబ్బా వాలాలు సమకూరుస్తున్నారు. పిల్లలకు స్వచ్ఛమైన పాలను పట్టించాలని తల్లిదండ్రుల్లో ఉన్న వీక్‌నెస్‌ను డెయిరీ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక పాల దిగుబడి కోసం పశువులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు సహా, బీర్‌దాణా వంటి హానికరమైన ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. ప్రత్యక్షంగా పశువుల ఆయుః ప్రమాణాన్ని తగ్గించడంతో పాటు పరోక్షంగా పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. మరికొంత మందైతే ఏకంగా కృత్రిమ పాలను తయారు చేసి వినియోగదారులకు అంటగడుతున్నారు. ఇటీవల జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేవెళ్ల, నందిగామ, ఆల్మాస్‌గూడ, నాదర్‌గుల్, ముచ్చింతల, పసుమాములలోని పలు డెయిరీల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించి పరీక్షించగా విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. నిర్దేశించిన ప్రమాణాల మేరకు పాల నాణ్యత లేకపోవడంతో ఆయా వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. డబ్బావాలాలు ఏకంగా తాగేందుకు ఏమాత్రం సురక్షితం కాని ఈకొలి బ్యాక్టీరియాతో కూడిన నల్లా నీళ్లను కలుపుతున్నారు. కల్తీ పదార్థాలు తగ్గకపోగా, మరింత పెరుగుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

ఆహార కల్తీపై ఫిర్యాదు చేయండి

జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్:	94923 01835
టోల్ ఫ్రీ నంబర్:	040–21111111



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు పీసరి మధుసూదన్‌రెడ్డి, అకుల రమేష్‌తో పాటు 40 మంది వివిధ పార్టీల నాయకులు బుధవారం ఎంపీ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల్లో వైఫల్యంపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలన్నారు. పార్టీని గ్రామ స్థాయిలోనూ మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు, మహిళలు పెద్ద ఎత్తున సభ్యత్వం పొందుతున్నారన్నారు. అనంతరం పశువుల ఆస్పత్రిని సందర్శించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీకి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మాణెయ్య, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తౌటోనికుంట పునరుద్ధరణపై హైడ్రా దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుకు (ఓఆర్ఆర్) సమీపంలోని ఖాజాగూడలో ఉన్న తౌటోనికుంట పునరుద్ధరణపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి సారించింది. బుధవారం చెరువును కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి తౌటోని కుంటలోకి నీరు చేరేందుకు ఉన్న మార్గాలను పరిశీలించారు. 'మనూ'కు చెందిన ఖాళీ స్థలంలో నిలుస్తున్న వర్షపు నీరు సమీపంలోని అపార్టుమెంట్ల సెల్లార్లలోకి వస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఆ నీరు నేరుగా తౌటోని కుంటకు చేరితే ఈ ఇబ్బంది ఉండదన్నారు. దీంతో పాటు ఈ చెరువు నిండితే అలుగు పారే నీరు నేరుగా భగీరథమ్మ చెరువుకు చేరేలా కాల్వలు



ఏర్పాటు చేయాలని అధికారులకు రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. జనావాసాల మధ్య ఉన్న చెరువుల పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉందని, తొలుత ఎఫ్‌టీఎల్ నిర్ధారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

ఇబ్రహీంపట్నం: స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల బతుకులు మారడంలేదని మండిపడ్డారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోందని దుయ్యబట్టారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువులకు సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. మూడేళ్లుగా రూ.7,500 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 15 లక్షల మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌పై ఆధారపడి విద్యనభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి విద్యార్థులను ఆదుకునేందుకు సకాలంలో నిధులు విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కందాడి శ్రీరామ్, కళ్లెం సూర్యప్రకాశ్, డి.శివకృష్ణ, పయ్యావుశెట్టి జగదీశ్, రుద్రపాల మహేందర్, నవీన్, పవన్, చరణ్, ఆదర్శ్, శివ, కార్తీక్, రాజేశ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

హామీలు అమలు చేయాలి


సమావేశమైన ఉద్యమకారులు

తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు

మొయినాబాద్: రాష్ట్ర సాధన కోసం కీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు కేబుల్ రాజు, కుమ్మరి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మొయినాబాద్‌లో ఉద్యమకారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ప్రభుత్వం 250 ఇంటి స్థలం ఇస్తానని హామీ ఇచ్చిందన్నారు. దాన్ని వెంటనే అమలు చేయడంతోపాటు ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తీర్చాలన్నారు. ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్తర తెలంగాణలో చేపట్టినట్లుగా త్వరలోనే దక్షిణ తెలంగాణలోనూ పాదయాత్ర చేపడతామన్నారు. ఆ పాదయాత్రను మొయినాబాద్ నుంచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు అవినాష్‌యాదవ్, ముకుందరెడ్డి, మేడిపల్లి నర్సింహ, కృష్ణ, వెంకటరత్నం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి స్పోర్ట్స్ మీట్



పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీన్ రామారావు

మొయినాబాద్ రూరల్: ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవంబర్ 4నుంచి 7వ తేదీ వరకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు తెలిపారు. మండల పరిధిలోని ఎన్టీఆర్ విద్యాసంస్థలో బుధవారం ఆయన పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పెయింటింగ్, ర్యాంప్‌వాక్, రంగోలి, మెహందీ, కరాటే, ఫుడ్ ఫెస్టివల్‌తో పాటు పలు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని స్పష్టంచేశారు. జిల్లాలోని దాదాపు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎన్టీఆర్ విద్యాసంస్థలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే.రెడ్డి, రాంచంద్రారెడ్డి, రాజీవ్‌రెడ్డి, ఏఓ సురేశ్ తదితరులు ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి జీవిత ఖైదు

కంటోన్మెంట్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి..గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళితే 2020లో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన బొగ్గుల సాయిలు (54), సికింద్రాబాద్‌లోని సింధి కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఫంక్షన్ హాలులో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. ఇదే ఫంక్షన్ హాలులో హౌజ్ కీపింగ్‌లో పనిచేస్తూ, బోయిన్‌పల్లిలో నివసించే వ్యక్తి (బాధిత బాలిక తండ్రి) కుటుంబంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ క్రమంలో 2019 మార్చిలో స్నేహితుడి మైనర్ కుమార్తెపై సాయిలు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత బాధిత బాలికను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2020 ఏప్రిల్‌లో బాధిత బాలిక తీవ్రమైన కడుపునొప్పితో బాధపడగా, ఆసుపత్రిలో చేర్పించి పరీక్షలు నిర్వహించడంతో ఆమె గర్భవతి అని తేలింది. బాధిత బాలిక, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుడిపై పొక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ అంజయ్య హయాంలో కేసు నమోదు కాగా, ఇన్‌స్పెక్టర్ కె.రవి కుమార్ విచారణ సాగించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.రామ్‌రెడ్డి, లీగల్ సపోర్ట్ ఆఫీసర్ టి.కల్పన, కానిస్టేబుళ్లు జే.సాయికుమార్, ఎస్.రాజేశ్‌లు కేసు విచారణలో కీలకంగా పనిచేశారు. నిందితుడిపై మోపిన అభియోగాలు రుజువు కావడంతో నాంపల్లిలోని 12వ మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రూ.7 లక్షల పరిహారాన్ని ప్రకటించారు.



షాబాద్‌లో విక్రయానికి సిద్ధంగా టపాసులు



దుకాణంలోని బాణసంచా

పండుగ.. ఆనందం మెండుగా

వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగ రానేవచ్చింది. మిరుమిట్లు గొలిపే కాంతులను ఆస్వాదించడమంటే పిల్లల దగ్గర నుంచి పెద్దల దాకా అందరికీ ఇష్టమే. జిల్లా వ్యాప్తంగా ఇంటి ముందు అలంకరించే ప్రతిమలు, లక్ష్మీపూజలకు ముస్తాబయ్యే వ్యాపార కేంద్రాలకు పూల కొనుగోలుతో ప్రస్తుతం మార్కెట్లు సందడిగా మారాయి.

దీపావళి వేళ లక్ష్మీ పూజలకు సిద్ధమైన ప్రజలు

- పూల విక్రయాలతో సందడిగా మార్కెట్లు
- టపాసులు కాలిస్తే.. జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచనలు

షాబాద్: అంబరాన్నంటే దీపావళి పండుగను వైభవంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. చిన్న పెద్ద పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా పండుగను ఆనందోత్సవాలతో నిర్వహించుకుంటారు. ఇప్పటికే టపాసులను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దీంతో బాణసంచా, వస్త్ర దుకాణాలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వ్యాపార వర్గాలయితే పండుగ రోజున లక్ష్మీ దేవిని పూజించేందుకు తమ దుకాణాలను శుభ్రం చేస్తున్నారు. షాపులను రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఎక్కడైతే ఎక్కువ శుభ్రత, ప్రశాంతత ఉంటుందో అక్కడ లక్ష్మీదేవి నిలుస్తుందని ప్రజలు విశ్వసిస్తుంటారు. లక్ష్మీదేవికి తొమ్మిది అవతారలతో ప్రత్యేక పూజలు చేస్తారు. వివిధ రకాల మిఠాయిలను తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. నూతన వస్త్రాలు ధరించి ఇళ్ల ముందు దీపారధన చేసి ఆనందోత్సలతో టపాసులు కాలుస్తారు.

అప్రమత్తత ముఖ్యం

ఎంతో ఆనందాన్ని పంచే దీపావళి వేడుకకు జాగ్రత్తలు తప్పనిసరి. సంబరాలను సంతోషంగా గడపాలంటే మాత్రం జాగ్రత్తలు పాటించాల్సిందే. ఏటా ఈ పండుగ సందర్భంగా జరుగుతున్న పొరపాట్లతో ఆస్తి, ప్రాణ నష్టాలు చోటుచేసుకుంటున్నాయి. వెలుగులు నింపేలా దీపావళి వేడుకను చేసుకోవడానికి కొన్ని సూచనలు షాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి ఇచ్చారు.

బాణసంచా విషయంలో జాగ్రత్తలు

- భారీ టపాసులను పిల్లల చేతికి ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలి.
- పెద్దల పర్యవేక్షణలో పిల్లలు చిన్నచిన్న టపాసులు మాత్రమే కాల్చేలా చూడాలి.
- పిల్లలు ధరించే దుస్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కాటన్ దుస్తువులు, కాస్త వదులుగా ఉండే వాటిని ధరించాలి.
- చిచ్చుబుడ్లు కాల్చే సమయంలో నిప్పులు ఒంటిపైకి రాకుండా దూరంగా ఉండాలి.
- టపాసులను ఆరుబయట కాల్చేలా చర్యలు తీసుకోవాలి. దారిపై, ప్రయాణాలు జరిగే చోట బాణసంచా పేల్చితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయి.
- పేలని టపాసులతో ప్రయోగాలు చేయకూడదు. టపాసులను గాజుముక్కలు, ఇనుము తదితర లోహాలపై పెట్టి పేల్చకూడదు.
- కాళ్లకు చెప్పులు తప్పనిసరిగా వేసుకోవాలి.
- పెద్ద శబ్దాల వల్ల ధ్వని కాలుష్యానికి గురికాకుండా చెవుల్లో దూది పెట్టుకోవాలి.
- బాణసంచాలను కేవలం లైసెన్సు కలిగిన దుకాణాలలోనే కొనుగోలు చేయాలి.
- బాణసంచా ముందుగానే ఇంట్లో పెట్టుకునేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వంటగదికి వెలిగే దీపాలు మంటలకు దూరంగా జాగ్రత్త పర్చాలి.

బాణసంచా కాల్చే క్రమంలో బాలుడికి ప్రమాదం

పహాడీషరీఫ్: బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలోనే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హర్షగూడలో ఓ బాలుడు టపాకాయలు కాలుస్తుండగా చేతికి తీవ్ర గాయమయింది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదు మాత్రం అందలేదు. పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో దాదాపు 30 దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం జరిగిందని పోలీసులు తెలిపారు. దీపావళి పర్వదినాన ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పిల్లలు టపాకాయలు కాల్చే సమయంలో వారిని అంటిపెట్టుకునే పెద్దలు ఉండాలని సూచించారు.

జైలు భయంతో ఆత్మహత్య

భార్య మృతి చెందిన నాలుగు రోజులకే ఉరి వేసుకున్న భర్త

చేవెళ్ల: ఇటీవల భార్య ఆత్మహత్య చేసుకోగా తాజాగా భర్త కూడా ఉరి వేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువెల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26వ తేదీన దంపతులు గొడవ పడిన సంఘటనలో భార్య వనజ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో తను జైలుకు పోతానేమోనని భయంతో భర్త అల్లరి రాజు అలియాస్ నాగేశ్(35) ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నాని చెప్పి గ్రామ శివారులో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి తల్లి అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మృతితో వారి పిల్లలు (ఇద్దరు కూతుర్లు, కొడుకు) అనాథలుగా మారారు.

పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై రోడ్డు ప్రమాదం

రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అతి వేగంగా అపోజిట్ రోడ్డుపైకి వచ్చి నిలిచిపోయింది. ఈ సంఘటనతో ఎక్స్‌ప్రెస్ వేపై దాదాపు గంట పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆరాంఘర్ వైపు నుంచి ఓ కారు మెహిదీపట్నం వైపు వెళ్లేందుకు పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపైకి ఎక్కింది. 300 నెంబర్ పిల్లర్ వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ఈ సమయంలో అటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో పలువురు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వాలీబాల్‌లో మెరిసిన జిల్లా జట్టు

గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నరప్



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా వాలీబాల్ జట్టు

కొడంగల్ రూరల్: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచిందని కొడంగల్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల పీడీ అజీజ్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి వీరేశం రంగారెడ్డి జట్టులో ఆడడం, రాష్ట్ర స్థాయి పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలో బుధవారం నిర్వహించారు. ఇందులో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచిందని తెలిపారు.

కబడ్డీలో మనమే నంబర్ 1

బహుమతులు అందజేసిన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు, నాయకులు

కొత్తగూడెం రూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో పాటు వైరా, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, జారే ఆదినారాయణ, కోరం కనకయ్యతో పాటు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న రంగారెడ్డి జిల్లా జట్టుకు రూ.75వేలు, ద్వితీయ బహుమతి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు రూ.60 వేలు అందజేశారు. అలాగే, మహిళా విభాగంలో నల్లగొండ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రూ.75 వేలు, రెండో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు రూ.60 వేలు అందించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 16 జట్లు హాజరు కాగా, అన్ని జట్లకు నగదు బహుమతులు అందజేశారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, చీకటి కార్తీక్, ఆళ్ల మురళి, నాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధి కత్తి మీద సామే

ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, సీఐ సుధాకర్

పహాడీషరీఫ్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బాలాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం స్టేషన్ పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహేశ్వరం డివిజన్ ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మల్లాపూర్, ఆర్సీఐ రోడ్డు, బాలాపూర్, కొత్తపేట, ఎర్రకుంట, షాహిన్‌నగర్, పహాడీషరీఫ్‌ల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సమాజంలో పౌరులకు భద్రత, రక్షణ కల్పించడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తారన్నారు. కత్తి మీద సాములాంటి విధి నిర్వహణ చేసే క్రమంలో ఎంతో మంది ప్రాణాలను సైతం పణంగా పెట్టారన్నారు. అలాంటి 0త్యాగమూర్తుల సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాసులు, యూసుఫ్ జానీ, శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంటలో డ్రంకన్ డ్రైవ్

పహాడీషరీఫ్: నగరంలో మద్యం తాగి వస్తున్న వాహనదారులతో శివారు ప్రాంతాలలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎర్రకుంట చౌరస్తాలో బాలాపూర్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. చాంద్రాయణగుట్ట ప్రాంతంలో ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి సరిహద్దులో ఉన్న ఎర్రకుంట, షాహిన్‌నగర్‌కు వస్తూ ప్రమాదాలు చేస్తున్న విషయమై బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి నేతృత్వంలో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్సై యూసుఫ్ జానీలు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలను నడపరాదని సూచించారు. ఈ రూట్‌లో డ్రంకన్ డ్రైవ్ లేదన్న ధీమాతో చాలా మంది తాగి వచ్చి ప్రమాదాలకు పాల్పడుతున్నారని, ఇకపై క్రమం తప్పకుండా ఈ డ్రైవ్ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

తల్లీకుమారుడి అదృశ్యం


కొడుకుతో సరిత (ఫైల్)

పహాడీషరీఫ్: భర్తతో గొడవపడిన గృహిణి కుమారుడితో కలిసి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్షగూడ గ్రామానికి చెందిన పత్లావత్ సరిత(27)కు తుక్కుగూడకు చెందిన పత్లావత్ రాజుతో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఈ నెల 28వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం డ్యూటీకి వెళ్లిన రాజు మరుసటిరోజు ఉదయం వచ్చి చూడగా భార్యతో పాటు కుమారుడు సాత్విక్(12) కనిపించలేదు. ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. సరిత సోదరుడు రూప్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


చేవెళ్ల ఆర్డీఓగా చంద్రకళ

చేవెళ్ల: రెవెన్యూశాఖలో జరిగిన బదిలీల్లో చేవెళ్లకు నూతన ఆర్డీఓగా కె.చంద్రకళ వచ్చారు. బుధవారం ఆమె స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల రెవెన్యూ తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం తెలిపారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన సాయిరాం బదిలీపై సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చంద్రకళ వచ్చారు.

చదరంగంలో విద్యార్థినుల ప్రతిభ


హిమబిందు


అనిత

షాద్‌నగర్: పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సౌత్ జోన్ చదరంగం టోర్నమెంట్‌లో షాద్‌నగర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు సత్తా చాటారు. ఈ టోర్నీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న హిమబిందు మూడోస్థానం సాధించగా, మరో విద్యార్థిని అనిత నాలుగో స్థానంలో నిలిచి యూనివర్సిటీ స్థాయిలో త్వరలో చెన్నైలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శైలజ విద్యార్థినులను అభినందించారు.

కొండను తవ్వుతున్న వాహనం సీజ్


బోడ గుట్టను తవ్వుతున్న హిటాచీ

తుర్కయంజాల్: అనుమతులు లేకుండా గుట్టను బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తిపైన అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌ఐ నిజాం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన బుధవారం రాగన్నగూడలో చోటుచేసుకుంది. తుర్కయంజాల్ రెవెన్యూ ప్రభుత్వ సర్వే నంబర్ 279లో నుంచి రోడ్డును వేసేందుకు కొందరు వ్యాపారులు, కొన్ని రోజులుగా బ్లాస్టింగ్ చేస్తూ బోడ గుట్టను తవ్వుతున్నారు. తాజాగా తిరిగి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం పనులను అడ్డుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం వాహనం యజమాని అంజిబాబుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ.. ఏ అనుమతులు లేకుండా నిబంధనలు పాటించకుండా బ్లాస్టింగ్ చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి

చేవెళ్ల: గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దేవుని శర్వలింగంలు పేర్కొన్నారు. మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో బుధవారం ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రజలకోసం అనేక పథకాలను తీసుకు వచ్చిందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అనేక పథకాలు రాష్ట్రంలో ఈ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు తెలియకుండానే నిరుపయోగం అవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.